# ఇరుకు

సలీం

**హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఎనిమిదంతస్తుల భవనం. సమయం ఉదయం తొమ్మిదీ నలభైఆరు నిమిషాలు. లిఫ్టుముందు క్యూలో ఇరవైమందిపైనే నిలబడి ఉన్నారు. ఆ భవనంలో ఎనిమిది వేర్వేరు ఆఫీసులున్నాయి. అందరికీ ఆఫీసులు తెరిచేది పదింటికి కావటంవల్ల ఆ సమయంలో ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది. దానికితోడు ఉన్న రెండు లిఫ్ట్‌లలో ఒకటి రిపేరులో ఉంది.**

మురళీకృష్ణ తలెత్తి లిఫ్ట్ ఇండికేటర్‌వైపు అసహనంగా చూశాడు. మూణ్నిమిషాలనుంచీ అయిదో అంతస్తులోనే ఉంది కదలకుండా.

"ఇది కూడా ఆగిపోయిందేమో!" తనముందు నిలబడిన శివరాంతో అన్నాడు. ఇద్దరూ ఎనిమిదో అంతస్తులో ఉన్న ఓ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నారు.

శివరాం అనాసక్తంగా ఓసారి చూసి, మరలా తన ఆలోచనల్లోకి వెళ్లిపోయాడు. ఉదయం పేపర్ చదివినప్పటినుండీ అతనికి అశాంతిగా ఉంది. ఓ మతం వ్యక్తిని మరో మతంవాళ్లు పొడిచారట ... పట్టణంలో ఉద్రిక్తత ... ఏ క్షణం ఏ జరుగుతుందోనన్న భయం! ఇలా ఎందుకుజరుగుతుందీ? నిరక్షరాస్యతవల్లనా? వాళ్ల పేదరికంవల్ల ఏర్పడిన కసిని ఈ రకంగా తీర్చుకుంటారా?

"చార్మినార్ దగ్గర మరోఇద్దర్ని లేపేశారటగా!" మురళీకృష్ణ అడిగాడు. "మరలా కర్ఫ్యూ పెడతారేమో ... అయినా వీళ్లకు పనీపాటా లేదా ... మరో మతంవాళ్లని చంపటం తప్ప?

"ఒక మతాన్ని ఇంకో మతం అని ఏముంది - ఒకే మతం ఉన్న ఇస్లాం దేశాల్లో షియాలూ, సున్నీలు కొట్టుకుని చావటంలేదా ... క్రిస్టియన్లలో కాథలిక్కులూ, ప్రొటెస్టంట్లూ ఒకర్ని ఒకరు చంపుకోవటంలేదా ... మన హిందువుల్లో శైవులూ, వైష్ణవులూ ఒకరి తలలు మరొకరు తెగ నరుక్కోలేదా? ఓ కులం మరో కులం మీద కాలు దువ్వుతుంది. ఓ వర్గం మరో వర్గంమీద ..."

"ఇలా ఎందుకు జరుగుతుందంటావ్?" అడిగాడు మురళీకృష్ణ అతనికి అసహనంగా ఉంది ... ఏదో ఒకటి మాట్లాడకపోతే మనసులోకి మిస్సైల్స్‌లా దూసుకొస్తున్నాయి అతని భార్య అన్న మాటలు ... "గయ్యాళి ... రాక్షసి ... ఏ జన్మలో ఏ పాపం చేసుకున్నానో..." కసిగా తిట్టుకున్నాడు.

శివరాం సమాధానం చెప్పకముందే లిఫ్ట్ తలుపులు తెరుచుకున్నాయి.

అప్పటివరకూ బుద్ధిగా క్యూలో ఉన్న జనం ఒక్కసారిగా చీలిపోయారు. ఒకర్ని ఒకరు తోసుకుంటూ ఎగబడ్డారు. కనీసం తమతోపాటు ఉన్న ముగ్గురు స్త్రీలను నెట్టకూడదన్న స్పృహ కూడా లేకుండా ... జీవితంలో ఒకే ఒక్కసారి మాత్రమే ఈ లిఫ్ట్‌లో ఎక్కే అవకాశం వస్తుందన్నట్లు ... అది జారవిడుచుకుంటే మొత్తం జీవితాన్నే కోల్పోతాం అన్నట్లు ... ఎగబడ్డారు.

మురళీకృష్ణని వెనకనుంచి ఒకతను బలంగా తోశాడు.

"ఇదేం ట్రైన్ కాదండీ - మనం ఎక్కకుండానే వెళ్లిపోతుందేమోనని భయపట్టానికి ..." తన భార్యమీద ఉన్న కసంతా కళ్లలో చూపిస్తూ వెనక్కి తిరిగి అన్నాడు మురళీకృష్ణ.

"అలానా ... ఛ! ... నేనిప్పటిదాకా అదే భ్రమలో ఉన్నాను సుమండీ!" అన్నాడతను వెటకారంగా. అతను రవిచంద్ర. నాటకాలు వేస్తుంటాడు. ఆరో అంతస్తులో ఉన్న ఆఫీసులో గుమాస్తా.

లిఫ్ట్‌లోకి పదమూడుమంది ఎక్కారు. లిఫ్ట్‌బాయ్‌తో కలిసి పద్నాలుగుమంది. లిఫ్ట్ కెపాసిటీ పదకొండుమంది మాత్రమే.

లిఫ్ట్ తలుపులు మెల్లగా మూసుకున్నాయి ... అప్పుడు టైం తొమ్మిదీ యాభై ...

లిఫ్ట్ పైకి కదల్లేదు. లిఫ్ట్‌బాయ్ షరీఫ్ స్విచ్‌ని ఎన్నిసార్లు నొక్కినా ప్రయోజనంలేదు. అంగుళం కూడా కదలనని మొరాయించింది లిఫ్ట్ ... తలుపులు తెరవటానికి బటన్స్ నొక్కాడు. అదీ పని చేయటంలేదు. అందరిలో ఆత్రుత ... అందరి మొహాల్లో ఉద్విగ్నత.

"ఏదీ నువ్వుండు .." అని కీబోర్డ్‌కి దగ్గరగా ఉన్న కిశోర్ ప్రయత్నించాడు. మీటల్ని ఎలా నొక్కినా, ఎంతసేపు నొక్కినా తలుపు తెరుచుకోలేదు. "మనం బంధించబడ్డాం!" అన్నాడతను ఆంగ్లంలో. అతను ఏడో అంతస్తులో ఉన్న 'కంప్యూటర్స్'లో ఉద్యోగస్తుడు.

షరీఫ్, అతనూ కలిసి బలవంతంగా తలుపు తెరవటానికి ప్రయత్నించారు. కొద్దిగా తెరుచుకుంది.

"నాలుగో అంతస్తులో ఎలక్ట్రీషియన్ ఉంటాడు. పిలుస్తారా?" ఆ గ్యాప్‌లోంచి అరిచాడు షరీఫ్. మరలా గ్యాప్ క్లోజ్ అయిపోయింది. టైం పదిగంటలైంది.


"ఇంకా నయం, కరెంటు పోలేదు. ఫాన్ ఉంది కాబట్టి బతికిపోయాం, లేకుంటేనా ..." అంటూ తన బాస్‌వైపు చూశాడు రవిచంద్రం. ఫుల్‌సూటులో ఉన్న అతని బాస్ నిజమేనన్నట్లు తల పంకించాడు.

రవిచంద్రం బాస్‌కి చాలా చిరాగ్గా ఉంది. చేయి కదపటానికి కూడా స్థలం లేదు. పదినిముషాల్నించీ పాంటు జేబుల్లో దాచుకున్న చేతులు మొద్దుబారినట్లు అనిపిస్తున్నాయి. ఒకరి శరీరం ఒకరికి పూర్తిగా తాకుతోంది. "బ్లడీ...." అనుకున్నాడు. అతనికి తను ఆఫీసర్‌ననే విషయం జ్ఞాపకం వచ్చింది. చేతులు బైటికి తీసి దర్పంగా నడుంపైన పెట్టుకున్నాడు. అతని మోచేతులు ఇరువైపులా ఉన్నవాళ్ల పొట్టల్లో గుచ్చుకుంటున్నాయి. ఓవైపున్న శివరాం వేదాంతిలా నవ్వుకున్నాడు ... మరోవైపున్న సూర్యం మండిపోతూ, "నిలబడ్డానికే చోటులేక ఛస్తుంటే ... ఇదొకటా ...!" అంటూ ఆ చేతుల్ని బలంగా కిందికి నెట్టాడు.

ఆఫీసరుగారికి బోల్డు అవమానం అనిపించింది. 'ఆఫ్టరాల్‌గాడు ... వీడెవడో ఇంతమందిలో నన్ను అలా అంటాడా?' అనే ఉక్రోషం ... ఆకాశమంత ఎత్తుకి లేచిన ఈగో ...

"యూ ... మానర్స్‌లెస్ ఫెలో!" అని గర్జించాడు.

"ఇంగ్లీషులో మాట్లాడినంత మాత్రాన మీకు మానర్స్ ఉన్నట్లా. ఇంతమందిమీ పావుగంటనించీ నిలబడి ఉన్నాం. కిక్కిరిసిపోయి ఒకరి ఊపిరి మరొకరు పీల్చుకునే దుస్థితిలో ఉంటే మీరలా భీముడిలా చేతులు నడుంమీద పెట్టుకుని నిలబడతానంటే ఎలా కుదురుతుంది? పక్కవాడికి



ఇబ్బంది కలిగించకుండా నిలబడాలన్న ఇంగితం కూడా లేదు మీకు!''

సూర్యం వాగ్దాటికి కొద్దిగా జంకినా, అందరిముందూ తను తక్కువ కాకూడదన్న మొండితనం ఆ ఆఫీసరులో.

రవిచంద్ర పరిస్థితి అడకత్తెరలో పోకలా ఉంది. ఓవైపు వాళ్ల బాస్ చేసింది అసమంజసంగా ఉంది. కానీ బాస్ ఆయె ... ఈ సమయంలో అతన్ని సమర్థించకపోతే గుర్తుపెట్టుకుని కక్షతీర్చుకునే రకం. అందులోనూ తను ప్రమోషన్‌కి దగ్గర్లో ఉన్నాడు. తన కాన్ఫిడెన్షియల్ రిపోర్టు కావాలని పాడుచేస్తే తన గతేంకాను?

"చూడండీ! వారు మా ఆఫీసరుగారు. వారలా చేతులుపెడితే అది మీకు అసౌకర్యంగా ఉందని చెప్పాల్సిందిపోయి మీరు మొరటుగా చేతులు

> ఏమిటో వదినా , మావారికి అప్పటికి ఇప్పటికి చిన్నపిల్లవాడి మనస్తత్వమే " గొప్పగా చెప్పింది ఓ ఇల్లాలు.
>
> " అదెలా" అడిగింది స్నేహితురాలు.
>
> " చిన్నతనంలో 'మీ అమ్మతో చెప్తానుండు' అని ఎవరైనా అంటే తెగ భయపడిపోయేవారట. ఇప్పుడు మీ ఆవిడతో చెప్తానుండు అన్నా అలాగే భయపడ్తున్నారు మరి!"
>
> **పి.వి. మురళీకృష్ణ**

నెట్టేయటం తప్పే!" అన్నాడు రవిచంద్ర.

"ఆఫీసరు అయితే ఏమిటట? బోడి ఆఫీసరు హోదా తన సీట్లో, తన కింది ఉద్యోగుల దగ్గర చూపించమను ... ఇక్కడ కాదు. అయినా ఆమాత్రం జ్ఞానంలేదా? వేరొకరు చెప్తేగానీ తెలుసుకోలేడా?" సూర్యం రౌద్రమూర్తి అయ్యాడు.

ఆఫీసరుగారికి పుండుమీద కారం చల్లినట్లయింది.

"నీ తాహతు తెలుసుకుని మాట్లాడు!" అన్నాడు.

"ఇప్పుడు అందరి తాహతూ ఒకటే ... కదలని తలుపులు ... తెరుచుకోని లిఫ్ట్‌లో అందరం బందీలం!" అన్నారెవరో.

అందరూ కిసుక్కున నవ్వారు.

"నేను ఢిల్లీదాకా వెళ్తాను ... నాకు మినిస్టర్లు తెలుసు. నీ ఉద్యోగం వూడపీకించగలను!" కల్లుతాగిన కోతిలా చిందులేస్తున్నాడు ఆఫీసరు. "అయినా ... నా చేతులు, నా నడుం నా ఇష్టం! హూ ఆర్యూ?" అంటూ ఎగిరెగిరి పడుతున్నాడు.

రవిచంద్ర తన బాస్‌కి తాన తందాన అంటున్నాడు.

సూర్యం ఆఫీసువాళ్లెవరూ అక్కడ లేకున్నా అతనికి వత్తాసుగా చాలామంది నిలబడ్డారు. మురళీకృష్ణ వాళ్ల లేడీ బాస్ హైమవతీ, రెండో అంతస్తులోని ఇన్స్యూరెన్స్ ఆఫీసరూ, తమ ఆఫీసరు జాతివాడు అవమానంపాలు కావటం భరించలేక అతనిపక్షం వహించారు.

అప్పటికప్పుడు అక్కడ రెండు గ్రూపులు ఏర్పడ్డాయి. ఆఫీసర్లూ, వారికి చెంచాగిరీ చేసే గుమాస్తాలూ ఓవైపు ... సూర్యం, మరి మిగతావాళ్లు మరోవైపు.

తిట్లు ... చీవాట్లు ... పెద్దపెద్దగా అరుచుకుంటూ "నువ్వు బైటికి రారా, నీ అంతు చూస్తాను!" అని ఒకడూ - "నీ పళ్లు రాలగొడతాను!" అని మరొకడూ ... రణరంగంలా తయారయింది. చేతులు కదల్చటానికి స్థలం లేదు కాబట్టి సరిపోయింది. లేకపోతే ఈపాటికి ముష్టియుద్ధం జరిగి ఉండేది.

బయటనుండి తలుపులు బలవంతంగా తెరవటానికి ఎవరో ప్రయత్నిస్తున్నారు. షరీఫ్ కూడా శక్తికొద్దీ లాగాడు. తలుపు ఓ అంగుళం తెరుచుకుంది.

"ఎలక్ట్రీషియన్ రాలేదట!" చావు వార్త చల్లగా చెప్పారెవరో.

"బయటికి రాడ్ ఉంటుంది. దాన్ని లిఫ్ట్ పక్కనున్న రంధ్రంలో పెట్టి గట్టిగా నొక్కండి. తలుపు తెరుచుకుంటుంది!" షరీఫ్ పెద్దగా అరుస్తూ చెప్పాడు.

"లోపల్నుంచి తీయటానికి వీలు కాదా?" ఎవరో అడిగారు. అందరి మొహాల్లో గాయాల్ని కప్పుకుంటున్న ఫీలింగ్ ...

"లేదండీ, ఆ పక్క లిఫ్ట్‌లో అలాంటి అవకాశం ఉంది. దీనికి బయటనుండే తీయాలి!" షరీఫ్ నిస్పృహగా చెప్పాడు.

బయట రాడ్‌పెట్టి కొడుతున్న చప్పుడు.

"అలా కొడితే రాదు, గట్టిగా నొక్కి వదలండి ... లాక్ విడిపోతుంది!" షరీఫ్ అభ్యర్థన.

మరలా గట్టిగా కొడుతున్న చప్పుడు.

"అయ్యో ... ఎన్నిసార్లు చెప్పినా అలా కొడతారేంటండీ? అలా రాదు. గట్టిగా నొక్కండి!"

మరలా ఫటఫటా కొడుతున్న చప్పుడు. షరీఫ్ తల పట్టుకున్నాడు.

టైం పదీ ఇరవై!

లిఫ్ట్‌బాయ్ కూర్చునే స్టూలుమీద కిశోర్ కూర్చున్నాడు - "మై లెగ్స్ ఆర్ ఏకింగ్ యార్!" అంటూ.

షరీఫ్ తలుపుని బలవంతంగా తెరిచి ఆ ఏర్పడిన సందులోంచి చెప్పాడు - "ఒక ఫేజ్ పనిచేయటంలేదేమో ... ఎవరైనా వెళ్లి జనరేటర్‌ని ఆన్‌చేయండి!"

"వేరే లిఫ్ట్‌బాయ్‌లు రాలేదా?" సూర్యం అడిగాడు.

"రావాలి సార్, నలుగురం ఉన్నాం ... మిగతా ముగ్గురూ ఇంకా రాలేదు."

"ఒళ్లు బలిసింది మీ అందరికీ ... ఎవ్వరూ అడిగేవాడే లేడని మీ ఇష్టారాజ్యం అయిపోయింది. వసూలు చేస్తున్న లక్షల అద్దె ఏం చేస్తున్నారు? మీ కేర్‌టేకర్ ఏమైనాడు? పిలిపించు!"

"మొదట కరెంటు ఆఫ్‌చేయండి. జనరేటర్ రూమ్‌లో ఓ స్విచ్ ఉంటుంది. అది ఆన్‌చేయ్యండి, సార్! ఎవరైనా వెళ్లి నాలుగో ఫ్లోర్‌లో కేర్‌టేకర్ ఉంటాడు, పిల్చుకురండి!" షరీఫ్ ఆ సందులోంచి అరిచాడు.

ఎవరైనా వింటున్నారో లేదో ... విని, చేస్తున్నారో లేదో తెలీని స్థితి. కరెంటు ఆఫ్‌చేసినట్లున్నారు. లైట్ ఆరిపోయింది. ఫాన్ ఆగిపోయింది.

లిఫ్ట్‌లో హైమవతి కాక మరో ఇద్దరు స్త్రీలున్నారు. రమా, నీలవేణి - ఇద్దరూ రెండో అంతస్తులోని ఇన్స్యూరెన్సు ఆఫీసులో ఉద్యోగినులు. పాతికేళ్లలోపు వయసు. ఇద్దరూ స్నేహితురాళ్లు.

లైటారినప్పటినుండీ రమ గుండె బితుకుబితుకుమంటోంది. ఆమె పక్కనే నిలబడిన మోహన్ ఆ అవకాశం కోసమే ఎదురు చూస్తున్నట్లు మెల్లిగా పక్కకు తిరిగాడు. కంప్యూటర్స్‌లో పనిచేసే అతని వయసు ముప్ఫైఆరు. సన్నగా, పొడవుగా, భుజాలమీదకి జారే జుట్టుతో ... సంజయ్‌దత్ లెవెల్లో ఊహించుకుంటూంటాడు.

రమకు అతను యాంగిల్ మార్చటం, తనవైపుకు తిరగటం తెలుస్తోంది. అతని శ్వాస వేడిగా ఆమె భుజానికి తగులుతోంది. రమకు భయం ఎక్కువ. పదిమందిలో అల్లరి అవుతామన్న బెదురు. 'పిరికిపిల్ల' అంటారందరూ.

మోహన్ చేతుల్ని మెల్లగా జరిపి తనముందుకు తెచ్చుకున్నాడు. ఇప్పుడు అతని చేతులకు ఆమె పిరుదుల ఎత్తులు తగులుతున్నాయి. రమ వీలైనంతగా అతన్నించి దూరంగా జరగటానికి ప్రయత్నించింది. వీలుకాలేదు. ఆమె ఒళ్లంతా చెమటతో తడిసిపోయింది. లిఫ్ట్‌లో అందరి పరిస్థితీ అలానే ఉంది. ఫాన్ ఆగిపోయి అప్పటికే నాలుగు నిమిషాలైంది. ఎండాకాలం ... ఊపిరాడటంలేదు.

"ఏమైందీ ... లోపల ఆఫీసర్లున్నారు. ఉక్కకు తట్టుకోలేరు!" షరీఫ్ బయటికి వినిపించేట్టు అరిచాడు.

"ఆఫీసర్లకేనా ఉక్కపోసేది! నీకు పొయ్యటంలేదా ... మాకు పొయ్యటంలేదా ... మేం మనుషులం కామా?" అంతెత్తున ఎగిరిపడ్డాడు సూర్యం. "ఈ బానిస మనస్తత్వం మారితేగానీ మనదేశం బాగుపడదు!" అన్నాడు.

ఇవేమీ పట్టించుకోకుండా మోహన్ తన అరచేతుల్ని విశాలంగా చాపి ఆమె పిరుదుల్ని నిమిరాడు. కేక వేయబోయి ఆగిపోయింది రమ. 'ఛీ! ఆడ బతుకు!' అని తిట్టుకుంది. 'భగవంతుడా! తొందరగా లైట్ వచ్చేటట్లు చెయ్యి!' అని వేడుకుంది. "జీవితంలో ఇంకేం కోరను ... ఈ లిఫ్ట్ నుంచి బయటపడితే చాలు!" అనుకుంది. రమేష్ చేతుల్ని మెల్లగా పైకి జరుపుతూ ఆమె నడుం ఒంపు దగ్గర నొక్కాడు. హఠాత్తుగా పొత్తికడుపులో కత్తి దిగబడినంత నొప్పి ... "అం.... మ్మా!" అని అరవబోయి పళ్లబిగువున బాధను నొక్కిపట్టాడు.

రమకు ఏం జరిగిందో అర్థంకాలేదు. కరెంటు

షాక్ కొట్టినట్లు చేతుల్ని దూరంగా జరుపుకున్నాడు. బహుశా భగవంతుడు తన మొర ఆలకించాడేమో అనుకుంది.

"ఏ స్విచ్ వేయాలో తెలీటంలేదు. జనరేటర్ ఆన్ కావటంలేదు!" బయటనుండి ఎవరో చెప్పారు గట్టిగా. మరునిముషమే లిఫ్ట్‌లో లైటు వెలిగింది. ఫాన్ తిరగటం ప్రారంభించింది. అందరూ 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నారు.

అందరికంటే ఎక్కువగా ఆనందపడిపోతూ నీలవేణివైపు చూసింది రమ. నీలవేణి కళ్లు గర్వంగా మెరుస్తున్నాయి. స్వతహాగా ధైర్యస్తురాలామె. స్త్రీవాది. ఆమె కళ్లల్లో మెరుపులకర్థం వెతుకుతూ నీలవేణి చేతులవైపు చూసింది. ఆమె కుడిచేతిలో జడపిన్ను ... దాని చివర్న అంటుకుని రక్తం చారిక.

రమకు జరిగిన విషయం అర్థమైంది.

టైం పదిన్నర!

"కేర్‌టేకర్ ఏడయ్యా?" సూర్యం గొంతులో అసహనం.

"కేర్‌టేకర్ రూమ్‌లో లేడండీ! అతన్ని వెతుక్కుని రావటానికి ఒకతను వెళ్లాడు!" బయటనుండి ఎవరో సమాధానం చెప్పారు.

"అయినా ఇంతమందిని ఎక్కించావ్ ... నీకు బుద్ధుందా?" షరీఫ్‌తో అన్నాడు మురళీకృష్ణ.

"నన్నేం చేయమంటారు, సార్! ఆపినా వినరు. తోసుకుని వచ్చేస్తారు. అదుగోండిసార్, ఆ మూలన ఉన్నారే ఆ ఇద్దరు సార్లు సెకండ్ ఫ్లోరే ... ఓసారి ఆపానని 'అస్టరాల్ లిఫ్ట్‌బాయ్‌గాడివి ... మమ్మల్ని ఆపుతావా?' అని కొట్టబోయారు. నేను అస్టరాల్‌గాణ్ణే కదా సార్! నా చేతుల్లో ఏముంది?" అన్నాడు షరీఫ్.

అందరి చూపూ మూలలో నిలబడి ఉన్న ఇద్దరివైపు మళ్లింది. ఇద్దరూ యువకులే. ముప్ఫయికి లోపలే ఉంటుంది వయసు. ఆరోగ్యంగా, బలంగా ఉన్నారు.

"సెకండ్ ఫ్లోర్‌కి మెట్లమీద వెళ్లలేరా, దానిక్కూడా లిఫ్ట్ కావాలా?" మురళీకృష్ణ అన్నాడు.

"లిఫ్ట్ ఉంది కాబట్టి ఎక్కాం! అయినా వారంలో నాలుగురోజులు ఈ లిఫ్ట్ రిపేరులో ఉంటుంది. అప్పుడెలాగూ మెట్లేగా శరణ్యం!" అన్నాడు వాళ్లలో ఒకతను. వాళ్లిద్దరికీ ఉక్రోషంగా ఉంది ... లేడీస్ ముందు అలా అవహేళనగా మాట్లాడినందుకు. అందునా ఇద్దరు లేడీస్ తమ ఆఫీసువాళ్లే!

"ఉంది కదాని ఎక్కార్ట! మీకేమండీ, ముసలివాళ్లా ... ముదితలా ... మెట్లెక్కితే కొద్దిగా కొవ్వైనా కరుగుతుందిగా!" అన్నాడు మోహన్, ఆడవాళ్ల దగ్గర హీరో అనిపించుకోవాలనే తాపత్రయంతో.

"అలా అని రూలుందా? బయట బోర్డు పెట్టండి. వృద్ధులకూ, స్త్రీలకూ తప్ప వేరేవాళ్లకు అవకాశం లేదని!" వాదనలోకి దిగారు వాళ్లు.

"స్త్రీలంటే శక్తిహీనులనా మీ ఉద్దేశం? మాకేం మీ సానుభూతి అక్కరలేదు! మీకంటే బాగా, మీకంటే చురుగ్గా మేం మెట్లు ఎక్కగలం!" నీలవేణి బుస్సుమంది.

"కేర్‌టేకర్ వచ్చాడు!" బయటనుంచి ఎవరో అరిచారు.

షరీఫ్ తలుపులు బలంగా తెరిచాడు. ఏర్పడిన గాప్‌లోంచి కేర్‌టేకర్ మొహం కనిపించింది.

సూర్యం తన కోపాన్ని మాటల్లోకి మార్చుకునేలోపల "రెణ్ణిముషాల్లో మెకానిక్‌ని పిల్చుకుని వస్తాను!" అంటూ కేర్‌టేకర్ అదృశ్యమైనాడు.

టైం పదీ నలభై!

మురళీకృష్ణకు కాళ్లు పీకుతున్నాయి. రాత్రంతా సరిగ్గా నిద్ర లేదు. ఒంటిగంట దాటినా గణగణ గంట కొట్టినట్లు అతని భార్య పోట్లాడుతూనే ఉంది. దేవుడామెకు అంత ఓపికా, కంచుకంఠం తనను శిక్షించడానికే ఇచ్చాడేమో!

ఉదయం ఏడు దాటకుండానే 'బతుకుజీవుడా' అని బయటపడి హోటల్లో సింగిల్ ఇడ్లీ తిని, చాయ్ తాగి, తెల్సిన రోడ్లన్నీ సర్వే చేసి వచ్చాడు. 'విడాకులిస్తే పీడా వదిలిపోతుంది!' అనుకున్నాడు. వెంటనే రెండేళ్ల కొడుకు అనిరుధ్ గుర్తొచ్చాడు. వాడి జీవితం ఏమైపోతుంది? సింగిల్ పేరెంట్ పెంపకంలో పెరిగే పిల్లల కష్టాలు తనకు ప్రత్యక్షంగా తెలుసు. తను అనుభవించిన కష్టాలు తన కొడుక్కి వారసత్వంగా ఇవ్వలేడు. దానికోసం ఎంత నరకమైనా తనే అనుభవిస్తాడు.

బరువును మరో కాలిమీదికి మార్చుకుంటూ చూశాడు ... కిశోర్ స్టూలుమీద జారగిలబడటం. మురళీకృష్ణకు కంప్యూటర్స్‌లో పనిచేసేవాళ్లంటే మొదట్నించీ ఏవగింపే. రఫ్ జీన్స్ వేసుకుని, స్టైల్‌గా మొన్ననే అమెరికానించో, ఇంగ్లండ్‌నించో ఇండియా వచ్చినట్లు ... ఇంగ్లీషు తప్ప వేరే భాష మాట్లాడరు.

కిశోర్‌ని పరిశీలనగా చూశాడు. వైట్ షర్ట్‌ని బ్లూ జీన్స్ పాంటులో టక్‌చేసి .... పాంట్ బెల్టుకి బిగించిన పేజర్ ... వీడి మొహానికి పేజర్ ఒకటి అనుకున్నాడు మురళీకృష్ణ.

అతను స్టూలుమీద కూర్చున్నప్పటినుంచీ మురళీకృష్ణకు అక్కసుగా ఉంది. ఆ ఆలోచన తనకు రానందుకు తనను తాను తిట్టుకున్నాడు. "రాస్కెల్ ... ఎంతహాయిగా కూర్చున్నాడో! వెధవ బుర్ర... నాకు తట్టలేదు. వాడికున్న ముందు చూపే నాకుంటే నా సంసారం దుఃఖసాగరం అయ్యేది కాదుగా!" అనుకున్నాడు.

ఎంత నిగ్రహించుకున్నా ఈర్ష్య పొంగిపొర్లుతోంది.


"ఇప్పటివరకూ కూర్చుంది చాలు ... కొద్దిగా లేస్తారా! ఓ అయిదు నిముషాలు నేను కూర్చుంటాను!" అన్నాడు మురళీకృష్ణ.

"ఇదేమన్నా ఫ్రంట్ ఎన్నుకున్న ప్రధానమంత్రి సీటు అనుకున్నారా ... వంతులవారీగా కూర్చోడానికి?" అన్నాడు కిశోర్ ఆంగ్లంలో.

లిఫ్ట్‌లోని కొంతమంది కిసుక్కున నవ్వారు.

"మేమందరం గంటనించీ నిలబడి ఉంటే మీరు కూర్చోవటం బాగోలేదు!"

"ఎవరికి బాగోలేదూ? నాకు బాగానే ఉంది!" కిశోర్ మరలా ఇంగ్లీషులో చెప్పాడు.



"అసలా స్టూల్ షరీఫ్‌ది. కూర్చుంటే అతను కూర్చోవాలి. నువ్వెలా కూర్చున్నావ్?"

"అతనికి లేని అభ్యంతరం నీకెందుకు? అది ఖాళీగా ఉంది, కూర్చున్నాను!"

"అది నీదీ నాదీ కానప్పుడు దానిమీద కూర్చునే అధికారం నీకెంతుందో, నాకూ అంతే ఉంది! ఆమాటకొస్తే ఈ లిఫ్ట్‌లో ఉన్న అందరికీ ఉంది!"

"అధికారం మాటేమో కానీ, అవకాశం నాకు దొరికింది. వినియోగించుకున్నాను. నీవు నాకంటే ముందే కూర్చుని ఉండాల్సింది. నేను నీలా సభ్యత లేకుండా అడ్డుచెప్పి ఉండేవాడిని కాదు!"

"ఆ సభ్యత ఉండబట్టే వయసు మళ్లినవాళ్లు, ఆడవాళ్లు నిలబడి ఉన్నప్పుడు కూర్చోకూడదన్న స్పృహతో కూర్చోలేదు!"

"మాట్లాడితే ఆడవాళ్లను బయటకు లాగుతారేమిటి? మీరు కూర్చోమన్నా కూర్చోం! గంటే కాదు, ఎన్నిగంటలైనా నిలబడే ఓపిక మాకుంది. వంట గదుల్లో గంటలు గంటలు నిలబడి చేస్తేనేగా మీరందరూ లొట్టలేసుకుంటూ తింటారు!" నీలవేణి నిప్పురవ్వలా మండిపడింది.

"సార్ ... మీలాంటివాళ్లు కూర్చుంటే బావుంటుంది. ఇతనికేం ... రాయిలా ఉన్నాడు. గంటనించీ దర్జాగా కూర్చునే ఉన్నాడు!" ఇన్సూరెన్సు ఆఫీసరుగారిని ఉద్దేశించి అన్నాడు మురళీకృష్ణ - అతన్ని ఉసిగొల్పి స్టూలుమీద కూర్చున్నవాణ్ణి కిందికి తోయాలన్న దురాలోచనతో.

"ఎలా కూర్చుంటారు? నేను ఈ స్టూల్ వదలాలి కదా ... వదలను! ఎందుకు వదలాలి?" అన్నాడు కిశోర్.

"నేను నిలబడగలను ... నో ప్రాబ్లెం!" అన్నాడు ఇన్సూరెన్సు ఆఫీసరు బింకంగా. అతని వయసు యాభై ఆరైనా ఆఫీసర్‌నన్న అహం అతనిలో.

"అది కుషన్ వేసిన కుర్చీ అయి ఉంటే ఎగబడి ఉండేవాడు. స్టూల్ కదా ... ఆఫీసర్లకు పనికిరాదండీ!" అన్నాడు వ్యంగ్యంగా మోహన్.

"మేమందరం నిలబడి ఉండగా అతను కూర్చోడానికి వీల్లేదు!" ఇన్సూరెన్సు ఆఫీసులో పనిచేసే ఇద్దరూ అరిచారు.

"మెకానిక్ వచ్చాడా?" షరీఫ్ తలుపు సందులోంచి ఎవర్నో అడిగాడు.

"నీవు స్టూలుమీంచి లేస్తావా, లేవవా?" మురళీకృష్ణ అతన్ని లేపటానికి భుజం దగ్గిర పట్టుకున్నాడు.

"నామీదనుంచి చేతులు తీస్తావా ... తన్నమంటావా?" కిశోర్ లేవకుండానే హుంకరించాడు.

"మెకానిక్ వచ్చేశాడు ... మరికొద్ది నిముషాలు ఓపికపట్టండి!" బయటనుంచి కేర్‌టేకర్ గొంతు వినిపించింది.

నెత్తిమీద శబ్దాలు ... లిఫ్ట్ పైన ఎక్కి రిపేరు చేస్తున్నారు.

అందరి మనసుల్లో ఎప్పుడెప్పుడు బయటపడాలా అన్న ఆతురత.

మోహన్ తలెత్తి పైకి చూస్తున్నాడు. అతను భుజాలవరకూ పెంచుకున్న జుట్టు అతని వెనక ఉన్నతని కళ్లల్లో పడుతోంది.

"ఏవిటండీ తలెత్తి చూసేదీ? ఏముందక్కడ?" అన్నాడతను వెటకారంగా.

"నేను చూస్తే నీకేంటి?"

"నీ జుత్తు నా కళ్లల్లో పడుతోంది."

"దానికి నేనేం చేయను? నువ్వు పొట్టిగా ఎందుకున్నావు? నాలా పొడవుగా ఉండాల్సింది."

"పొడవుగా ఉన్నావని పొగరా ... ఆ మొహం, జులపాలు చూసుకున్నావా ... కొండముచ్చులా ... వాంతికొచ్చేలా ..."

"ఏమన్నావ్ .... మళ్లీ అను!"

"అంటా(నా ... ఏం చేస్తావ్? కొడతావా ... నేను పొడుస్తాను ... చంపుతాను ... నరుకుతాను ...!"

మెల్లగా లిఫ్ట్ తలుపులు తెరుచుకున్నాయి.

అందరి మొహాల్లో అంతులేనంత ఊరట.

మెట్లెక్కుతూ మురళీకృష్ణతో శివరాం అన్నాడు - "నీవు అడిగావు చూడు, ఎందుకిలా చంపుకుంటారని ... నా ఉద్దేశంలో ఈ మతాలూ, కులాలూ లేకున్నా ఇలానే చంపుకుంటా రనుకుంటా. ఇవన్నీ బాహ్యంగా కనిపించే అతి చిన్న కారణాలే ... అంతర్లీనంగా ఉన్న అసలైన కారణం - వీరిలోని రాక్షస ప్రవృత్తి చావకపోవటం ... జంతువులతోపాటు తిరుగాడుతూ, వాటితో పోరాడుతూ బతికిన ఆదిమానవుడితో పోలిస్తే, ఇప్పటి మనిషి పైకి సంస్కారవంతంగా, సభ్యతాయుతంగా కనిపించినా, లోపలి పశుప్రవృత్తిని మాత్రం వదులుకోలేకపోతున్నాడు. లిఫ్ట్‌లోని ఇరుకు కారణం అనుకుంటున్నావా గొడవకి ... కాదు. వీళ్లవి ఇరుకు మనసులు. హృదయ వైశాల్యాన్ని పెంచుకోలేని మనిషి మృగంలా ప్రవర్తిస్తూనే ఉంటాడు ... ఈ మారణహోమం ఇలా కొనసాగుతూనే ఉంటుంది!"

లిఫ్ట్ రిపేర్ జరుగుతున్న చప్పుడు వినిపిస్తోంది. ఎప్పటికి అది బాగుపడుతుందో!

■





## ఎలక్ట్రిక్ మనిషి!

చైనా సెజువాన్ నగరంలో వి (46) అనేమనిషి ఎలక్ట్రిక్‌వైర్‌ని పట్టుకుంటే అందులో ఎలక్ట్రిసిటీ ప్రవహిస్తుంది. నీళ్లలో చేతినుంచి ఆ నీటిని వేడి చేయగలడు. ఆ శక్తితో అరచేతిలో చేపని ఉంచుకుని ఫ్రై చేయగలడు. ఇతనికున్న ఈ విపరీతశక్తిని తన ఇల్లు రిపేర్ చేస్తూ, ఎలక్ట్రిసిటీ ప్రవహించే లైవ్ వైర్‌ని పొరపాటున ముట్టుకున్నప్పుడు గుర్తించాడు. అతనికి షాక్ కొట్టలేదు. ఇతనిలో 600 ఓల్ట్‌ల విద్యుత్‌శక్తి ప్రవహిస్తోందని శాస్త్రజ్ఞులు నిర్ణయించారు. ఇతను ఓ ఎలక్ట్రికల్ కంపెనీలో పనిచేయడం కాకతాళీయం.

\- పృథ్వీరాజ్